# సామాజికాంశం

గత వారం సామాజికాంశంలో బి. చంద్రశేఖర్ రాసిన వ్యాసంలో ప్రస్తావించిన విషయాలపై స్పందించటం అవసరం. భిన్న స్వభావంగల విషయాలను కుప్ప వేసి ఆయన చేసిన విశ్లేషణ చాలా అసంతృప్తి కరమైనది. కొన్ని విషయాలు అభ్యంతరకరమైనవి కూడా!

భారతదేశంలోని కులవ్యవస్థ గురించి విదేశీయులకు ఇదివరకు తెలియకపోలేదు. కానీ ఇప్పటిదాకా దానిని వారు సామాజిక శాస్త్రవేత్తలు, సాహిత్యకారులు, పర్యాటకులు చేసిన రచనల చూసారు. అంబేద్కర్ వంటి ఒకరిద్దరిప్రయాస ఈప్రభావాన్ని అడ్డుకోలేకపోయింది. కులాన్ని ఒక సజీవ అనుభవంగానూ, ఒక వికృతమైన వ్యవస్థగానూ చూసే అవకాశం బాహ్యప్రపంచానికి ఈ మధ్యనే లభించింది.. భారతదేశంలోని దళితులలో కొందరు చదువుకుని సామాజిక శాస్త్రవేత్తలయి, రచయితలయి తమ గొంతు వినిపించటం మొదలుపెట్టిన తరువాతే అది సాధ్యమయ్యింది. దళితులలో చదువుకున్న కొత్త తరమొకటి ముందుకొచ్చి తమ ఆలోచనల్లను అనుభవాన్నీ తమ భాషలలోనే కాక ఇంగ్లీష్‌లోనూ వ్యక్తం చేయగలగటం ఈ పరిణామానికి ఒక పార్శ్వంకాగా, ప్రపంచం ఈరోజు సాంకేతికంగా 'గ్లోబల్ విలేజ్' కావటం రెండవ పార్శ్వం.

గ్లోబలైజేషన్ అనే మాటను రెండు అర్థాలలో ప్రయోగించటం జరుగుతున్నది. ఒక అర్థంలో ప్రపంచమంతా పెట్టుబడికి ఏ అవరోధాలూ అవధులూ లేని మార్కెట్‌గా మారడాన్ని సూచిస్తోంది. ఇది అవాంఛనీయం. అభ్యంతరకరం. మరొక అర్థంలో ప్రపంచంలోని అన్ని మూలలనూ కలిపే సమాచార విప్లవాన్ని సూచిస్తోంది. ఇప్పుడు ఏ మూల జరిగే విషయమూ దాగదు. ఈ సమాచార సాంకేతిక ప్రక్రియలు పెట్టుబడిదారీ గ్లోబలైజేషన్‌కు సాధనంగా ఉపయోగపడుతున్నంత మాత్రాన వాటికి వేరే ప్రాముఖ్యం లేదని గానీ, వేరే అర్థం లేదనిగానీ, వేరే విలువ లేదనిగానీ అనుకోకూడదు. మెక్సికోలో జరుగుతున్న చియాపాస్ ఉద్యమం సమాచార విప్లవాన్ని వాడుకొని మెక్సికో ప్రభుత్వంపైన ప్రపంచ వ్యాపితమైన ఒత్తిడి తేగలిగింది. మన దగ్గర దళిత ఉద్యమకారులు కొంత మేరకు అదే పని చేయగలిగారు. అయితే ఎవరి ప్రయత్నమూ లేకుండా కూడా, కేవలం సమాచార గ్లోబలైజేషన్ వల్ల భారతదేశంలోని దళితులస్థితిగతులు ఎన్నడూ లేనంత ఎక్కువగా బయటి దేశాలలో తెలియవచ్చాయి. యూదులకూ నల్లజాతీయులకూ జరిగినఅన్యాయానికి అంతగాస్పందిచినప్రపంచం ఈ అన్యాయానికి ఎందుకు స్పందించదు అన్న ప్రశ్నను ప్రపంచం ఎదుట నిలబెట్టాయి. హ్యూమన్ రైట్స్ వాచ్ భారతదేశంలో దళితుల స్థితిగతుల గురించి 'ది బ్రోకెన్ పీపుల్' అనే నివేదిక ప్రచురించడాన్నీ, ఐక్యరాజ్య సమితి కులాన్ని తన అజెండాలో చేర్చాలన్న ప్రతిపాదనను స్వీకరించడాన్నీ, పెట్టుబడిదారీ మార్కెట్ల విస్తరణకోసంజరుగుతున్న కుట్రగా కాక ఈ పరిణామాలలో భాగంగాచూడడం సబబుగా ఉంటుంది. హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలకు సంబంధించినంత వరకు వేరే కోణం కూడా ఉంది. ఈ సంస్థలు చాలా కాలం హక్కులను కేవలం రాజ్యహింసకు సంబంధించిన విషయాలుగా చూసాయి. లాకప్‌హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, అప్రజాస్వామిక చట్టాలు, మరణదండన, ప్రివెంటివ్ డిటెన్షన్ మొదలైన హక్కుల సమస్యలపైన ఈ సంస్థలు విశేషంగా కృషిచేసాయి. ఆ కృషి మనబోటి దేశాలలో పనిచేస్తున్న హక్కుల ఉద్యమాలకు అండనిచ్చింది. అయితే హక్కులంటే ఇవేనా, సామాజిక అణచివేత మీకు కనిపించదా అన్న సవాలును వారు మొదటినుండీ ఎదుర్కొంటూ వచ్చారు, తమ సంస్థలలో దీర్ఘంగా చర్చించుకున్నారు. చివరికి సామాజిక అణచివేతను కూడా తమ అజెండాలో చేర్చుకున్నారు. ఆహ్వానించదగినది అయిన ఈ పరిణామానికి పెట్టుబడిదారీ గ్లోబలైజేషన్‌తో సంబంధమేముంది?

**ఎన్జీఒల రంగ ప్రవేశం తరువాత ఉద్యమకారుల స్థానంలో ఉద్యోగులు, ఉద్యమ మేనేజర్లూ తయారౌతున్నారు. తమ జీవన ప్రమాణాలు దెబ్బతినకుండా ఒక ప్రాజెక్టు నుండి మరొక ప్రాజెక్టుకు మారుతూ బతికేవారు వీరిలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఐక్యరాజ్య సమితి సదస్సులలో వీరు పాల్గొనడం బదులు ప్రజాసంఘాలు ఒకరిద్దరు ప్రతినిధులను డర్బన్ సదస్సుకు పంపించగలిగితే బాగుంటుంది అని సూచిస్తున్నారు ప్రముఖ మానవహక్కుల ఉద్యమ నాయకుడు డాక్టర్ కె.బాల్‌గోపాల్**



# డర్బన్ సదస్సు- ఒక భిన్న కోణం

ఐక్యరాజ్య సమితి కూడా చాలా కాలం పౌరరాజకీయహక్కుల మీదనే దృష్టి పెట్టి వివిధ ఒడంబడికల క్రోడీకరణ కోసం అఖిల ప్రభుత్వ సదస్సులు నిర్వహించింది. ఇది యాభై ఏళ్లుగా జరుగుతున్నప్పటికీ తొలినాడు ఆ సదస్సులలో పాల్గొన్నది ప్రభుత్వాలు మాత్రమే కాబట్టి వాటికి పెద్దగా ప్రచారం రాలేదు. చట్టబాహ్యమైన హత్యాకాండ, పోలీసు అత్యాచారాలు, యుద్ధ నియమాలు, నేర విచారణ పద్ధతి, జాతి వివక్ష, జెనోసైట్ మొదలైన విషయాల మీద ఈఅఖిలప్రభుత్వసదస్సులలో ఐక్యరాజ్య సమితి తీర్మానాలు చేయించగలిగింది. ఈ తీర్మానాలకు గురైన ప్రభుత్వాలన్నీ 'ఇది జాతి రాజ్యాలుగా మాకు ఉండే సార్వభౌమత్వం మీద దాడి' అని అల్లరి చేసినప్పటికీ ఎవరూ ఒప్పుకోలేదు. ఐక్యరాజ్య సమితి మీద అగ్రరాజ్యాల ప్రభావం చాలా కాలంగా ఉన్నప్పటికీ, దాని తీర్మానాల అమలుకు భరోసా లేనప్పటికీ, వాటిని విలువ లేనివిగా హక్కుల ఉద్యమం భావించలేదు. గడచిన కొన్ని సంవత్సరాలుగా ఐక్యరాజ్య సమితి సామాజిక ఆర్థిక వ్యవస్థల మీద కూడా దృష్టి సారించింది. స్త్రీల హక్కులు, పర్యావరణం, అభివృద్ధి అనే అంశాల మీద సదస్సులు నిర్వహించింది. గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకమైన అంశాలు కూడా ఆ తీర్మానాలలో చోటు చేసుకున్నాయి. రేపు కుల వివక్ష కూడా ఐక్య రాజ్యసమితి ఎజెండా మీదకు రావచ్చు. కుల వివక్షను 'జాతి సంబంధమైన వివక్ష'గా గుర్తించడం కాకుండా, విడిగానే కుల వివక్ష మీద డర్బన్ సదస్సు తీర్మానిస్తే బాగుండేది. ఏది ఏమైనా భారత పాలకులను ప్రపంచదేశాల వేదికమీద నిలదీయడమైతే జరుగుతుంది. ఒకప్పటి ఐక్యరాజ్య సమితి సదస్సులకూ ఈ మధ్య జరుగుతున్న వాటికీ ఉన్న ఒక్క తేడా ఏమిటంటే, గతంలో ఈ సదస్సులలో ప్రభుత్వాలు మాత్రమేపాల్గొనగా, ఇప్పుడుప్రజల ప్రతినిధులుగా ప్రభుత్వేతర సంస్థలను కూడా పాల్గొననిస్తున్నారు. అయితే ఈ అవకాశాన్ని భారీగా నిధులు అందుబాటులో ఉన్న సంస్థలు మాత్రమే వాడుకోగలగడం వల్ల ఈ సదస్సులలో ప్రజా సంఘాలను పాల్గొననివ్వడంలో గల లక్ష్యం దెబ్బతినడం లేదా అన్న సందేహం వస్తుంది. ఎన్జీఒలకు వేరే ఏదో నిఘూడమైన ఎజెండా ఉందని నమ్మకపోయినా వారికి ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం ఎంత అన్న సంశయం ఉండడం సహేతుకమే.

సాన్నిహిత్యం ఒక్కటే కాదు, బాహ్య నిధులతో (విదేశీయమే కానక్కరలేదు)పనిచేయడం, ఉద్యమాల లక్ష్యాలను నిధులిచ్చేవారి ప్రాధాన్యతల ప్రకారం రూపొందించడమేకాక, ఉద్యమాల లక్షణాలను కూడా దెబ్బతీస్తుంది. ఉద్యమాలు ఏప్రజలలో పనిచేస్తున్నాయో ఆ ప్రజలు సమకూర్చే నిధులతోనే పనిచేయడం అత్యుత్తమం. లేదా, కనీసం తమ కార్యకలాపాలను గౌరవించే వారిపైన ఆధారపడచ్చు. ఎవరో ఇచ్చే నిధులతో పనిచేయడం ఉద్యమాల ఆరోగ్యానికి మంచిదికాదు. ఎన్జీఒల రంగ ప్రవేశం తరువాత ఉద్యమకారుల స్థానంలో ఉద్యమ ఉద్యోగులు, ఉద్యమ మేనేజర్లూ తయారౌతున్నారు.వారిలో చాలా మందికి ఉద్యమం ఒక వృత్తే తప్ప మనసు లగ్నమై పని చేసే ఆదర్శం కాదు. ప్రజలతో పరిమితమైన సంబంధాలు పెట్టుకొని, తమ జీవన ప్రమాణాలు ఎంతమాత్రం దెబ్బతినకుండా ఒక ప్రాజెక్టు నుండి మరొక ప్రాజెక్టుకు మారుతూ బతికేవారు ఎన్జీఒలలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్వహించే సదస్సులలో ప్రజల ప్రతినిధులుగా వీరు పాల్గొనడం ఆ అవకాశానికే నష్టం చేయగలదు. దాని బదులు బయటి నిధులు లేకుండా పనిచేసే ప్రజాసంఘాలు తమకున్న పరిమితమైన నిధులను పోగుచేసి ఒకరిద్దరు ప్రతినిధులను పంపించగలిగితే బాగుంటుంది. అయితే ఈ సారి డర్బన్‌కు ఆంధ్ర ప్రదేశ్ నుంచి పోతున్న బృందంలో ఎన్జీఒల్లకంటే దళితఉద్యమంలో చాలాకాలం కృషిచేసిన వారు, బాధిత దళితులు ఎక్కువమంది ఉన్నారు. కాబట్టి మన రాష్ట్రప్రాతినిధ్యం అర్థవంతంగానే ఉండగలదు. చివరగా హక్కుల ఉద్యమాన్ని గురించి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలకు జవాబు చెప్పాలి. హక్కుల ఉద్యమానికి దేశీయ స్ఫూర్తి లేదని, పాశ్చాత్య సిద్ధాంత కారుల సిద్ధాంతాలే దానికి పునాదిగా ఉన్నాయని, కుల వివక్ష గురించి మాట్లాడేటప్పుడు కూడా 'మన బసవడిఉద్యమంలాంటి వాటిని గుర్తుచేసుకోం' అని ఆయన అంటున్నారు. హక్కుల ఉద్యమానికి మానవీయ స్ఫూర్తి ఉండాలిగానీ, దేశీయ స్ఫూర్తి ఎందుకు ఉండాలి (మానవీయత అంతా ఈ దేశంలోనే ఉందను కుంటే తప్ప) ? కుల వివక్ష గురించి మాట్లాడేటప్పుడు బసవడి ఉద్యమం లాంటి వాటిని కాకపోతే ఫ్రెంచి విప్లవాన్ని గుర్తుచేసుకుంటున్నామా? అర్థం లేని అభాండాలు వెయ్యడం ఎందుకు? కనీసం ఒక దశాబ్దం కాలంగా హక్కుల స్ఫూర్తికి మూడు మూలాలు ఉన్నాయని గుర్తిస్తున్నాం. ఒకటి పాశ్చాత్య ప్రజాతంత్ర విప్లవంలో వ్యక్తమైన హక్కులు, రెండు ఆ ప్రజాతంత్ర అవగాహనలో పరిమితులను ఎత్తిచూపుతూ పాశ్చాత్యదేశాల్లో మొదలైన కార్మిక, మహిళా, నల్లజాతి, పర్యావరణ ఉద్యమాలు, వలసదేశాల తిరుగుబాట్లు. మూడు, మనదేశంలో బుద్ధుడి కాలం నుండి ఉన్న బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు, ఇప్పుడు సాగుతున్న ప్రజా ఉద్యమాలు. ఇందులో మొదటి రెండింటి నుండి మనం పొందినది, పొందేది ఏమీ లేదని కానీ, అందులోని విషయాలన్నీ మనదేశంలోనే అంతకుముందే ఉన్నాయని గానీ అనదల్చుకుంటే, సోదాహరణంగా వాదిస్తే చర్చించుకోవచ్చు. రెండురాళ్లు ఎత్తి మీదపడేసి ఉతుకొని చావండి అనడం విమర్శ కాదు, చర్చించే పద్ధతీ కాదు.